ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం సీఎంఆర్‌ఎఫ్

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



సైదులు కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. హయత్‌నగర్‌కు చెందిన కందుకూరి సైదులు అనారోగ్యంతో ఇటీవల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందాడు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.36,500లు మంజూరైంది. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం సైదులు కుటుంబ సభ్యులకు మధుయాష్కీగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి డబుల్ ఇల్లు, ఉపాధి కల్పించండి

● కలెక్టర్‌కు మధుయాష్కీగౌడ్ సూచన

హయత్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల గేటు విరిగిపిడి ఘటనలో మృతిచెందిన బాలుడి కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇల్లు, ఉపాధి కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సూచించారు. హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల గేటు విరిగిపడిన ఘటనలో అజయ్ అనే విద్యార్థి మరణించిన విషయం విదితమే. కాగా హయత్‌నగర్ త్యాగరాయనగర్‌లో ఉంటున్న బాలుడి తల్లిదండ్రులు ఆలకుంట చందు, సరోజలను మధుయాష్కీ గురువారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో సంభాషిస్తూ బాలుడి కుటుంబానికి సహకారం అందించాలని, పాఠశాలలోనే బాలుడి కుటుంబంలో ఒక్కరికి అటెండర్ లేదా ఏదైనా ఉద్యోగం కల్పించాలని డీఈఓకు సైతం ఫోన్లో ఆయన సూచించారు.



ఓపెన్ జిమ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఓపెన్ జిమ్ పనుల పరిశీలన

కొత్తపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రూ.47లక్షలతో కొత్తపేట డివిజన్‌లోని కాలనీల పార్కు స్థలాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మానస ఎన్‌క్లేవ్ పార్కులో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్నేహపురికాలనీ, మోహన్‌నగర్, జనప్రియ క్వార్టర్స్, సత్యానగర్ జనప్రియ అవెన్యూ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వెంకటరామయ్య, నవీన్, అంజనీ, భాగ్యరేఖ, పద్మ, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయ సైలెంట్ ఒలంపియాడ్‌లో సత్తాచాటిన బధిర పాఠశాల విద్యార్థులు

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ముంబైలో జరిగిన సైలెంట్ ఒలంపియాడ్ స్పోర్ట్స్ మీట్‌లో మలక్‌పేట ప్రభుత్వ బధిరుల ఆశ్రమపాఠశాల విద్యార్థులు తమ సత్తాచాటారు. రన్నింగ్, లాంగ్‌జంప్, చెస్, షార్ట్‌పుట్ తదితర పోటీల్లో గెలుపొంది 6 బంగారు పతకాలు, 12 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. గురువారం మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమపాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను వికలాంగుల సహకార సంస్థ డైరెక్టర్ బి.శైలజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బధిర విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి పతకాలు సాధించి పాఠశాలకు మంచిపేరు ప్రఖ్యాతులు తేవడం హర్షించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు శేషారత్నం, టీచర్లు యుగేందర్, రుక్మిణి, పరిమళ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు కె.శ్యాంరావు, బాబు శ్రీనివాస్ తదితరులు

మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు కల్పించాలి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఎస్సీ వర్గానికి చెందిన నాయకులు కె.శ్యాంరావు, బాబు శ్రీనివాస్, వెంకటస్వామి, డి.గోపాల్, ధర్మేంద్ర, జి.నర్సింహ, డి.శ్రీనివాస్, జె.రాజేశ్‌లతో కూడిన బృందం తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం శంకేశ్వర్‌బజార్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కె.శ్యాంరావు, బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌ను ఎస్సీ వర్గీకరణ తరహాలో మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి చాటుకున్న సీఎం రేవంత్‌రెడ్డి తాము చేసిన విన్నపాలపై కూడా దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు.

దేశాభివృద్ధి కోసం పరితపించేది సీపీఐనే



సీపీఐ జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

హయత్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి కోసం పరితపించే నిజమైన రాజకీయ పార్టీ సీపీఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడాలో సీపీఐ గ్రామ కార్యదర్శి చల్లా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల సభకు రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనను అంతం చేసి స్వపరిపాలన కోసం కృషి చేసిన సీపీఐ వందవ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని అన్నారు. 2005లో కోహెడాలో భూపోరాటం నిర్వహించి ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, కేతరాజు నర్సింహ పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 1051 మంది చిన్నారులకు

వెట్టి నుంచి విముక్తి

● నిర్వాహకులపై 464 కేసులు నమోదు చేసిన పోలీసులు



చిన్నారులను కాపాడిన ఆపరేషన్ స్మైల్ బృందాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చేపడుతున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లు మంచి ఫలితాలను చూపుతున్నాయి. ఆపరేషన్ స్మైల్ 11లో భాగంగా తనిఖీలు నిర్వహించిన ప్రత్యేక బృందాలు రాచకొండ కమిషనరేట్‌లో ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న 1051మంది చిన్నారులను కాపాడారు. ఏటీహెచ్‌యూ, షీటీమ్స్, శిశు సంరక్షణ అధికారులు కలిసి బృందాలుగా ఏర్పడి జనవరిలో పలు పారిశ్రామిక వాడలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న బాలలను గుర్తించి కాపాడారు. కాపాడిన వారిలో 985మంది బాలురు, 66మంది బాలికలు ఉన్నారు. వీరిలో 512మంది బాలురు, 28మంది బాలికలు తెలంగాణకు చెందిన వారు కాగా 473మంది బాలురు, 36మంది బాలికలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. బాలలతో పనిచేయించుకుంటున్న నిర్వాహకులపై పోలీసులు 464 కేసులు నమోదు చేయడంతోపాటు మరో 410 జీడీ ఎంట్రీలు చేశారు. మంచి పనితీరును కనబరిచిన స్మైల్ బృందాలను సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

సెల్లార్ స్లాబ్ పూర్తయ్యే వరకు అనుమతులు లేవని తెలీదట

● తీరిగ్గావచ్చి రంధ్రాలు చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు



పూర్తైన సెల్లార్ స్లాబ్‌కు రంధ్రాలు చేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లోని గ్రీన్‌పార్క్‌కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన సెల్లార్ స్లాబ్‌కు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గురువారం రంధ్రాలు చేశారు. 1215 గజాల స్థలంలో ఎనిమిది నెలలుగా భారీ ఎత్తున సెల్లార్ గుంత తవ్వి సెల్లార్ స్లాబుల నిర్మాణం పూర్తిచేసి గ్రౌండ్ ఫ్లోర్ పిల్లర్ల నిర్మాణం చేపట్టేంత వరకు కూడా నిర్మాణ అనుమతులు లేవన్న విషయం స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆదేశించే వరకు ఇంత పెద్ద అక్రమ నిర్మాణం స్థానిక అధికారులకు కనిపించకపోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఎల్బీనగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్రమంగా నిర్మించిన సెల్లార్ స్లాబ్‌కు రంధ్రాలు చేసి మమ అనిపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేదిలేదని ఆయన స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టి నష్టపోవద్దని ఆయన సూచించారు. అక్రమ కట్టడాల వెనుక ఎంతటివారున్నా కొంత సమయం ఆలస్యం కావచ్చు కానీ కూల్చివేయడం మాత్రం ఖాయమన్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి



ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని చంద్రపురికాలనీలో వాణిజ్య సముదాయ భవన నిర్మాణంలో భాగంగా సెల్లార్‌గుంతలో పిల్లర్లు వేసే ఘటనలో మట్టి దిబ్బలు కూలి ముగ్గురు కూలీలు బలికావడం చాలా బాధాకరమని, ఈ ఘటనలో బిల్డర్, టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం ఎంతగానో ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మట్టి దిబ్బలు కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడం, మరొకరు గాయాలతో సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన విదితమే. ఇందులో భాగంగా ప్రమాదం జరిగిన స్థలాన్ని గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధన ప్రకారం సెల్లార్‌లో పిల్లర్లు వేసే ముందు రీటైనింగ్ వాలు నిర్మించకపోవడం, కూలీలకు గ్లౌజులు, షూస్, హెల్మెట్ వంటివి ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ భవన నిర్మాణంలో బిల్డర్ జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి జాగ్రత్తలు తీసుకునేలా చొరవ తీసుకోకపోవడం వంటివి వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని, సంబంధిత బిల్డర్, అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రపురికాలనీ సభ్యులు వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, బాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మన్సూరాబాద్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, రమేష్‌చారి, పారంద సాయి పాల్గొన్నారు.

సెల్లార్ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ



సెల్లార్ ఘటనకు బాధ్యులపై చర్యల కోసం జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నేతలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల సమయంలో మట్టిదిబ్బలు పడి ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోయి, ఒకరు తీవ్ర గాయాలపాలైన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోన్ కార్యాలయంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పాటు బిల్డర్, కాంట్రాక్టర్ల పట్టింపులేని తనం కారణమని వారన్నారు. నిబంధనలు పాటించడం లేదని నోటీసులు ఇచ్చిన అధికారులు పనులు నిలిపివేసి ఉంటే కూలీల ప్రాణాలు నిలిచేవి కదా అని ఆయన ప్రశ్నించారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ, ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ సక్రునాయక్, సరూర్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు పుజారి శ్రీను, బోయపల్లి రాములుగౌడ్ పాల్గొన్నారు.

బీసీల రాజ్యంలో పెత్తనం ఉన్నత వర్గాలదే : నర్సింగ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగ్‌రావు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఓట్లు, సీట్లు బీసీలవే అయినప్పటికీ పెత్తనం ఉన్నత వర్గాల వారు చేస్తున్నారని మన ఆలోచన వ్యవస్థాపకుడు, తెలంగాణ బీసీ ఉద్యమ నేత, ఆవేర్ ఫౌండేషన్ చైర్మన్ కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు బీసీలోని వివిధ కుల సంఘాలతో జరిపే ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా గురువారం నాగోల్‌లోని మన ఆలోచన ప్రధాన కార్యాలయంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించారు. ఈసందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ బీసీలో బలమైన నాయకత్వం పెంపొందేలా పద్మశాలీలు కృషి చేయాలని సూచించారు. నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి, నక్క కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు బాస శ్రీధర్, ఏలే పురేందర్‌నేత, డాక్టర్ గుర్రం నర్సింహారావు, చెన్నా శ్రీకాంత్, దొంత ఆనంద్, గుండెటి శ్రీధర్, పశాల కృష్ణ, గాజుల శ్రీహరి, బాసబత్తిని రాజేశం, పెండం లక్ష్మణ్, తీరందాస్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మెడికల్ పీజీ విద్యార్థినికి ఆర్థిక సాయం



మెడికల్ పీజీ విద్యార్థి స్వర్ణకు శాలువ కప్పి అభినందిస్తున్న రమేష్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన మూసారాంబాగ్ బంజారాబస్తీ నివాసి నైనావత్ స్వర్ణ మెడికల్ పీజీ కళాశాలలో అడ్మిషన్‌కు అవసరమైన ఫీజును చెల్లించేందుకు బీజేపీ భాగ్యనగర్ జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేశారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుకోడానికి ఆర్థిక సహాయం చేసిన రమేష్‌రెడ్డి తాజాగా తమిళనాడు సేలంలోని ప్రభుత్వ మోహన్ కుమార మంగళం మెడికల్ కళాశాలలో పీజీ సీటు (మెడికల్ జనరల్ సర్జరీ) రావడంతో అందుకు అవసరమైన ఫీజు చెల్లించేందుకు ఈసారి కూడా ముందుకు వచ్చారు. తనకు మెడికల్ విద్యను అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన రమేష్‌రెడ్డికి స్వర్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో గల షిరిడీసాయి సంస్థాన్‌లో చైర్మన్ రమేష్‌రెడ్డితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించగా శాలువ కప్పి ఘనంగా అభినందించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌పటేల్, కొంగర ప్రవీణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

కొత్తపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు నిబంధనల అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు కొనసాగుతున్నాయని ఎల్బీనగర్ సీపీ క్యాంపులోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. గురువారం మన్సూరాబాద్ జడ్‌పీహెచ్‌ఎస్ నుంచి 57మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. లెక్చర్ హాల్‌లో టీటీఐ అధికారులు వారికి ట్రాఫిక్ నిబంధనలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు ఏర్పాటుచేశారు. యాచారం పరిధిలోని ఆరు పాఠశాలల్లో, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితర 14ప్రాంతాల్లో నిబంధలను అధికారులు వాహనాల డ్రైవర్లకు, ప్రజలకూ వివరించారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ రోడ్డు భద్రత, హెల్మెట్, సీటుబెల్టు ప్రాధాన్యత, మద్యం మత్తులో వాహనాలు నడిపితే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేసిన కరపత్రాలను పంపిణీ చేశారన్నారు.

90 మందికి డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 45మంది మద్యంప్రియులకు 45మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద చిల్డ్రన్‌పార్కు లెక్చర్ హాల్‌లో గురువారం 4విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ అర్జున్, విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓపీ అల్లూరయ్య కౌన్సెలింగ్, తనిఖీల ప్రాధాన్యతనూ వివరించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలి : పెంటయ్య



బిక్కయ్యకు నియామకపత్రం అందజేస్తున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని మాడ్గుల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఏర్పుల బిక్కయ్యను నియమించినట్లు ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పంది పెంటయ్య తెలిపారు. ఈమేరకు గురువారం పెద్దఅంబర్‌పేట్‌లోని ఆయన కార్యాలయంలో బిక్కయ్యకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని చెప్పారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీ పదవులను అప్పగించనున్నట్లు తెలిపారు.

రైతు కుటుంబానికి సహకార సంఘం ఆసరా

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యుడైన తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య 15 రోజుల క్రితం మృతిచెందాడు. దాంతో మృతుడి కుటుంబానికి సహకార సంఘం ద్వారా రూ.25వేలను గురువారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రాకేష్‌గౌడ్, జంగయ్య, కిట్టుయాదవ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేట సర్కిల్ 6 పరిధిలో ఈనెల 10వ తేదీ నుంచి వార్డు కార్యాలయాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సర్కిల్ 6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు ఫారాలు ఇప్పటికే సర్కిల్ కార్యాలయానికి వచ్చాయన్నారు. మలక్‌పేట సర్కిల్ ఏడు వార్డు కార్యాలయాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు, ఇతర మార్పులు చేర్పులు చేసుకునే వారు వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇటీవల సర్వేచేసిన రేషన్‌కార్డుల అర్హుల జాబితా త్వరలో నిర్వహించే వార్డు సభల్లో లిస్టు ప్రకటిస్తారని తెలిపారు. అదేవిధంగా సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 90శాతం పూర్తయింది. శనివారంతో సర్వే ముగుస్తుందని తెలిపారు.

కార్లకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపుకు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నిరకాల కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్‌ఫిల్మ్‌లను తొలగించేందుకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం నుంచి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ ఆదేశాల మేరకు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్‌ఫిల్మ్‌లను తొలగించేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో జరిగిన పలు సంఘటనలను దృష్టిలో పెట్టుకుని కార్ల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌లను ఏర్పాటు చేయరాదని నిబంధనలు విధించారు. వాటిని అతిక్రమిస్తూ చాలామంది కార్ల యజమానులు కార్ల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌లను ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తుండడంతో వాటి తొలగింపు కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించడానికి మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా కార్ల యజమానులు తమ కార్ల అద్దాలకున్న బ్లాక్‌ఫిల్మ్‌లను స్వచ్ఛందంగా తొలగింపుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆటోనగర్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

● రెండు కంటైనర్లు దగ్ధం



తగలబడుతున్న కంటైనర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ పారిశ్రామిక వాడలో గురువారం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ సత్యనగర్‌కాలనీకి చెందిన బన్నెల్ బస్వరాజ్(52) కొంత కాలంగా ఆటోనగర్‌లో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణం పక్కన ఉన్న ఖాళీప్రదేశంలో ఇంజన్‌లేని రెండు కంటైనర్లు ఉన్నాయి. ఈ క్రమంలో బస్వరాజ్ తన స్క్రాప్ దుకాణంలో ఉన్న ప్యాకింగ్ అట్టలను, ఇతర వస్తువులను పెట్టుకోవడానికి ఒక కంటైనర్‌ను వాడుకుంటున్నాడు. మరో కంటైనర్ ఖాళీగా ఉంది. కాగా గురువారం అకస్మాత్తుగా ప్యాకింగ్ అట్టలు ఉన్న కంటైనర్‌లోంచి మంటలు వ్యాపించడంతో పక్కనే ఉన్న మరో కంటైనర్‌కు మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని తగలబడుతున్న కంటైనర్ల మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. అట్టలతో నిండిన కంటైనర్ పూర్తిగా, మరొకటి పాక్షికంగా దగ్ధమయ్యాయని, దీంతో రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్లు స్క్రాప్ నిర్వాహకులు బస్వరాజ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



దేవాని బక్కయ్య

హయత్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన దేవాని బక్కయ్య(72) రెండు నెలల క్రితం హయత్‌నగర్ పాపయ్యగూడలో పశువుల కాసేందుకు వచ్చాడు. స్థానికంగా ఉండే సుగుణ వద్ద పశువుల కాపరిగా చేరాడు. మూడు రోజుల క్రితం బక్కయ్య కనిపించకపోవడంతో సుగుణ బక్కయ్య అల్లుడైన రమేష్‌కు ఫోన్‌చేసి మీ మామ కనిపించడం లేని చెప్పింది. దీంతో రమేష్ హయత్‌నగర్ రావినారాయణరెడ్డి కాలనీకి చేరుకుని చుట్టుపక్కల వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో గురువారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితను కాపాడిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వివాహితను పోలీసులు కాపాడారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్ బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బాలాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడుతుందని డయల్ 100కు ఫోన్ రావడంతో వెంటనే స్పందించిన కానిస్టేబుల్ రాజు, తరుణ్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చీరతో మెడకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్న మహిళను కాపాడారు. దీంతో మహిళ ప్రాణాలను కాపాడిన ఇద్దరు కానిస్టేబుళ్లను స్థానికులు, ఇతర సిబ్బంది అభినందించారు.

ఎల్బీనగర్‌లో చైన్‌స్నాచర్ అరెస్టు

● ఒకటిన్నర తులాల బంగారు గొలుసు స్వాధీనం

కొత్తపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ క్రైమ్ పోలీసులు ఓ చైన్‌స్నాచర్‌ను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి. ఉప్పులేటి శశిధర్(21) సూర్యోదయకాలనీలో ఉంటున్నాడు. అతడు మద్యానికి, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల పాలయ్యాడు. అదే కాలనీలో ఉండే రుక్మిణమ్మ(87) అనే వృద్ధురాలి మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం అతడిని అరెస్టు చేసి ఒకటిన్నర తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.